## కేసుల సత్వర పరిష్కారానికి
# లోక్ అదాలత్‌లు దోహదం

ఇబ్రహీంపట్నంరూరల్ : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

### ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 14 : కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికే లోక్‌అదాలత్‌లు పనిచేస్తాయని, వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ ద్వారా 399 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. రాజీ మార్గంతోనే కక్షిదారుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మెరుగుపడతాయన్నారు. ప్రజలు సమయాన్ని వృథా చేసుకుని కోర్టులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగకుండా సమస్యను మొదట్లోనే పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రీటాలాల్ చంద్, లోక్ అదాలత్ సభ్యులున్నారు.

ఆమనగల్లు : జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

మాట్లాడుతూ.. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో 521 కేసులు పరిష్కరించగా.. రూ.8,23,300 జరిమానా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

### 45 కేసులు పరిష్కారం

**ఆమనగల్లు :** రాజీయే రాజమార్గం అని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లులోని కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ శనివారంతో ముగిసింది. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 45 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. ఇందులో ఏడు కేసుల్లో కక్షిదారులు రాజీ అయినట్లు చెప్పారు. మిగతా 38 కేసుల్లో జరిమానా కట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కార్తీక్, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న రిటైర్డ్ సీనియర్ జడ్జి సాంబశివరావు

### మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం

**చేవెళ్లటౌన్ :** మద్యం తాగి వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు తెలిపారు. శనివారం చేవెళ్లలోని కోర్టు అవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో 521 కేసులు పరిష్కరించగా.. రూ.8,23,300 జరిమానా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

# గురుకుల పాఠశాలల్లో కామన్ డైట్

మొయినాబాద్, డిసెంబర్ 14 : ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని అధికారులు శనివారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రారంభించారు. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలోని వంటగదిని, కూరగాయలను పరిశీలించారు. పాఠశాలలో డైట్ మెనూను ప్రారంభించారు. మండల పరిధిలోని తోలుకట్టా గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలను మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, రెవెన్యూ శాఖ ఓఎస్‌డీ, ఐఎఫ్ఎస్ శ్రీలక్ష్మి, గురుకుల విద్యా సంస్థ జోనల్ అధికారి నిర్మల, సీడీపీవో హెస్పీబా పాఠశాలను సందర్శించి డైట్ మెనూను ప్రారంభించారు.

తోలుకట్టాలోని చేవెళ్ల గురుకుల పాఠశాలలో డైట్ మెనూను ప్రారంభిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

### మెనూ ప్రకారం భోజనమందించాలి

కడ్తాల్ : వసతి గృహాల్లో ఉండి చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు భరోసా, ఆత్మ విశ్వాసం కలిగించాలని సూచించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలకు పరేడ్ బ్యాండ్ కొనుగోలుకు ఆయన రూ.10 వేల చెక్కును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత, ఎంపీడీవో సుజాత, ఏవో శ్రీలత, హెచ్‌డబ్ల్యూవో రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్ రాములుకు రూ.10 వేల చెక్కును అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి


మున్సిపాలిటీ పరిధి తారామతిపేటలోని హరిహరపుత్ర ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయ రెండో వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో గణపతి హోమం, ధ్వజారోహణం, అభిషేకాలు, ఊరేగింపులు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వేదపండితులు ఉన్నికృష్ణన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.
– పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 14


లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

## కనులపండువగా కల్యాణోత్సవం

కడ్తాల్, డిసెంబర్ 14 : తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో కొలువుదీరిన లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని శుద్ధ జలం, పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి సమర్పించే పట్టు వస్త్రాలు, తలంబ్రాలను గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల కరతాళ ధ్వనుల మధ్య, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, ఏఎంసీ చైర్మన్ గీత, ఆలయ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ అమృత, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గల వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రతి నెల రెండవ శనివారం నిర్వహించే పూజా కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, చండూ రధారణ, హనుమాన్ చాలీసా పఠనం, సత్యనారాయణస్వామి వ్రతాలు, హోమాలు, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం జరిగింది.

# అన్నదానం మహా దానం

అయ్యప్పస్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్, డిసెంబర్ 14 : అయ్యప్ప మాల దీక్షాపరులకు అన్నదానం చేస్తే ఎంతో పుణ్యం వస్తుందని, అన్ని దానాల కన్న అన్నదానం మిన్న అని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లోని చౌడమ్మగుట్ట వద్ద శనివారం అయ్యప్పస్వాములకు అయన అన్నదానం చేశారు. అంతకుముందు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, నాయకులున్నారు.

షాద్‌నగర్‌లోని శ్రీశివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో దత్తజయంతి సందర్భంగా దత్తాత్రేయ స్వామివారికి శనివారం ఉదయం నుంచే అభిషేకాలు, అర్చనలు వంటి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ అర్చకుడు రవిశర్మ తెలిపారు. స్వామివారికి డోలాహరణం కార్యక్రమం చేపట్టి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

## హైటెన్షన్ విద్యుత్ లైన్ సర్వే అలైన్‌మెంట్‌ను మార్చాలి

కడ్తాల్‌లోని రైతులు, నాయకులతో మాట్లాడుతున్న బీదర్ పవర్ గ్రిడ్ డీజీఎం సంతోశ్

కడ్తాల్, డిసెంబర్ 14 : మండల కేంద్రానికి అతి సమీపంగా వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ సర్వే అలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు, స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు శనివారం బీదర్ పవర్ గ్రిడ్ డీజీఎం సంతోశ్‌తో మండలకేంద్రంలోని బాధిత రైతులు, నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, రైతులు పలు సమస్యలను డీజీఎంకు విన్నవించారు. బీదర్ పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ ద్వారా బళ్లారి నుంచి మీర్‌ఖాన్‌పేట్ గ్రామం వరకు 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ పోల్స్ ఏర్పాటుకు అధికారులు సర్వే నిర్వహించారన్నారు. కడ్తాల్ గ్రామం రెవెన్యూ పరిధిలోని పలు సర్వే నంబర్ల గుండా హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ లైన్ పోల్ కోసం సర్వే మార్కింగ్ చేపట్టారని తెలిపారు. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేపట్టి, మార్కింగ్ చేయడం ఏంటని రైతులు ప్రశ్నించారు. గతంలోనే కడ్తాల్ గ్రామం గుండా నాలుగు హైటెన్షన్ లైన్లు వెళ్లడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. ప్రస్తుతం మరో విద్యుత్ లైన్ ఏర్పాటు సర్వే చేయడం సబబు కాదని తెలిపారు. తాతల కాలం నుంచి వ్యవసాయాన్నే జీవనాధారంగా చేసుకుంటున్న భూముల్లో, హైటెన్షన్ లైన్‌కు సంబంధించిన పోల్స్ ఏర్పాటు చేస్తే చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా నష్టపోతారన్నారు. మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అగ్రికల్చరల్ జోన్, ప్రభుత్వ భూములు ఉన్నాయని, వెంటనే సంబంధిత అధికారులు హైటెన్షన్ పోల్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

## నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

### 11 షాపుల యజమానులపై కేసు నమోదు

చేవెళ్లటౌన్, డిసెంబర్ 14 : పోలీసు ఉన్నతాధికారుల అదేశాల మేరకు చేవెళ్ల లోని పాన్ షాపులను తనిఖీ చేశారు. 11 పాన్ షాపుల్లో అక్రమంగా అమ్ముతున్న నిషేధిత పొగాను పోలీసులు స్వాధీనం చేసుకుని.. షాప్ యజమానులపై కేసులు నమోదు చేశారు. నిందితులను ఇకపై సమాజ ప్రయోజనాల దృష్ట్యా మంచి ప్రవర్తన కలిగిన వ్యక్తులుగా ఉండాలని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

చేవెళ్లటౌన్, డిసెంబర్ 14 : గుండెపోటుతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చేవెళ్ల ఆర్టీసీ బస్సు స్టేషన్‌లో శనివారం జరిగింది. చేవెళ్ల ఎస్సై సంతోశ్‌రెడ్డి కథనం ప్రకారం.. చేవెళ్ల మండల పరిధి ఆలూర్ అనుబంధ గ్రామమైన వెంకన్నగూడ గ్రామానికి చెందిన దన్నారం బుచ్చయ్య(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం రోజు మాదిరిగానే వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కలవారిని అడుగగా వికారాబాద్ వెళ్లి అదే రోజు తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు చేవెళ్లకు వచ్చినట్లు తెలిసిందని తెలిపారు. శనివారం ఉదయం 11.45కు బస్టాండ్‌లో చూడగా కూర్చున్న చోటే గుండెపోటుతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మొక్కలు నాటిన అయ్యప్ప మాలధారులు

కడ్తాల్, డిసెంబర్ 14 : రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోశ్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు విశేష స్పందన లభిస్తున్నది. శనివారం కడ్తాలో మండలం మైసిగండి గ్రామంలో గల శివాలయం–రామాలయ ఆవరణలో గురుస్వామి భీముడునాయక్, అయ్యప్ప స్వామి మాలధారులు.. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

# భారత రాజ్యాంగం గొప్పది

### ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మోలుగారం

హిమాయత్‌నగర్, డిసెంబర్14: ప్రపంచంలోనే అత్యున్నత భారత రాజ్యాంగం గొప్పదని ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మోలుగారం, హైకోర్టు జడ్జి మాధవీ దేవి, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నరసింహారెడ్డి అన్నారు. శనివారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్‌లోని ఆడిటోరియంలో '75 ఏండ్ల భారత రాజ్యాంగం – గతం, భవిష్యత్‌లో సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పరిపాలనకు సంబంధించిన నియమాలు, సూత్రాల సమాహారం కాదని.. స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలకు మూల స్తంభాలుగా నిలుస్తాయన్నారు. అన్ని విధాలా ప్రజల అభివృద్ధిని కోరుకునే సమున్నత ఆశయమని తెలిపారు. 75 ఏండ్లుగా సామాజిక, ఆర్థిక, లింగ భేదాలకు అతీతంగా దేశ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తూనే ఉన్నారు. పేద, ధనిక తేడాలేకుండా ఓటు హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛను నచ్చిన విధంగా పాటిస్తున్నామంటే.. రాజ్యాంగం ఇచ్చిన చలవేనన్నారు. న్యాయ విద్యార్థులు దేశంలో తమ బాధ్యత ఏమిటి అనే అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. విద్యార్థులు బాధ్యతతో మెలుగుతూ దేశ భవిష్యత్తును ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం కాలేజీ ముద్రించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా నరసింహశర్మ, ఓయూ పీజీఆర్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.బి.రెడ్డి, వెస్ట్ బెంగాల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఈశ్వరభట్, ఓయూ లా విభాగం డీన్ డాక్టర్ విజయలక్ష్మి, బెంగళూర్ ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగిరెడ్డి, ప్రొఫెసర్ నందిని, రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ సభ్యురాలు డాక్టర్ రమాదేవి, ప్రతినిధులు డాక్టర్ దావీద్ అంబ్రోస్, డాక్టర్ రాధిక యాదవ్ ఉన్నారు.

## కొలువుదీరిన పట్నం మార్కెట్ కమిటీ పాలకవర్గం

ప్రమాణస్వీకారం చేస్తున్న ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ పాలకవర్గం

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 14 : మార్కెట్ కమిటీ పాలకవర్గం కలిసికట్టుగా పనిచేసి మార్కెట్ అభివృద్ధికి తోడ్పడాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్‌తో పాటు 14 మంది డైరెక్టర్లను మార్కెట్ కమిటీ కార్యదర్శి సంతోశ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రోడ్డు భవనాల కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి, జిల్లా సహకార సంఘం చైర్మన్ సత్తయ్య, మున్సిపల్ చైర్మన్లు స్రవంతి, నిరంజన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహిపాల్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

యాచారం, డిసెంబర్ 14 : మూడు కార్లు ఒకేసారి ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయపడిన ఘటన మండలంలోని చౌదర్‌పల్లి గేటు సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి మాల్ వైపు వెళ్తున్న కారు చౌదర్‌పల్లి గేటు వద్దకు రాగానే ముందు నుంచి వెళ్తున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల నుంచి వస్తున్న మరో కారు ముందు కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన సునీత(35), బాలాపూర్ టీకేఆర్ కమాన్‌కు చెందిన లక్ష్మి(45) తీవ్రంగా గాయపడ్డారు. వీరిరువురిని 108లో చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## భారీ బహిరంగ సభకు తరలిన కురుమలు

మణికొండ, డిసెంబర్ 14 : రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం నేతృత్వంలో శనివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు గండిపేట మండలం నుంచి భారీ ఎత్తున కురుమ కులస్తులు కోకాపేట్‌లో జరిగిన సభకు హాజరయ్యారు. మండల పరిధిలోని మణికొండ, మంచిరేవుల, బండ్లగూడ, ఖానాపూర్, వట్టినాగులపల్లి, పుప్పాలగూడ తదితర గ్రామాల నుంచి ఆయా గ్రామాల కురుమ సంఘాల ఆధ్వర్యంలో కుటుంబ సమేతంగా భారీఎత్తున తరలివెళ్లారు. మణికొండ, మంచిరేవుల, పుప్పాలగూడ గ్రామాల నుంచి కోకాపేట్‌కు తరలివెళ్లే దారిలో నార్సింగి ప్రధాన చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కురుమ సంఘం సభ్యులు డోలు వాయిద్యాలతో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. గండిపేట మండలం నుంచి దాదాపు నాలుగు వేల మంది కురుమలు హాజరైనట్లు మండల కమిటీ అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు భాస్కర్ తెలిపారు.

స్లాప్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ సమక్షంలో దాతలు ఎల్బీనగర్ సాయి భక్తులు జనార్దన్ రావు, గీత, సురేశ్‌చంద్ర సహకారంతో మున్సిపాలిటీ పరిధి పసుమాముల సంతోష్‌నగర్ లెప్రసీ కాలనీలో బాధితులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సరుకులతో పాటు దాదాపు 70 కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నూతన వస్త్రాలను అందజేశారు.
– పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 14

# విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

సిటీబ్యూరో, డిసెంబర్ 14 ( నమస్తే తెలంగాణ ) : విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు 40 శాతం మెస్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచామన్నారు. షేక్‌పేటలోని సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. 20 మంది క్రీడాకారులకు జూడో డ్రెస్‌లు కలెక్టర్ ఆధ్వర్యంలో అందిస్తామని పేర్కొన్నారు. నెల రోజుల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

### సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**శంషాబాద్ రూరల్ :** సంక్షేమ హాస్టల్ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా తయారు చేయాలని రాష్ట్ర కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ సూచించారు. శనివారం ప్రభుత్వ హాస్టల్స్ గురుకులాల్లో డైట్, కాస్మోటిక్ చార్జీలు 40 శాతం పెంచిన సందర్భంగా శంషాబాద్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కమర్షియల్‌ట్యాక్స్, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ

## నేటి నుంచి అంతర్జాతీయ హస్తకళ ఉత్సవం

కొండాపూర్, డిసెంబర్ 14 : శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పారామంలో ప్రతి సంవత్సరం నిర్వహించే అంతర్జాతీయ హస్తకళ ఉత్సవం డిసెంబర్ 15వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిల్పారామం, భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, నేషనల్ జ్యూట్ బోర్డుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవం కొనసాగుతుందన్నారు. హస్తకళ స్టాల్స్‌తో పాటుగా ప్రతి రోజూ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శనివారం సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా డాక్టర్ వినీలరావు తన శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కూచిపూడి నృత్య ప్రదర్శనలో డాక్టర్ వినీలరావు శిష్య బృందం

నృత్య ప్రదర్శనలతో అలరిస్తున్న కళాకారులు

## అలరించిన నృత్యార్చన

మాదాపూర్, డిసెంబర్ 14 : కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనావాహినిలో పద్మశ్రీ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత విష్ణు సహస్రనామ, అన్నమయ్యపురం గురు స్తుతిని ఆలపించారు. శృతిలయ సంగీత కూచిపూడి నాట్యాలయ, పిఠాపురం సంస్థ గురువు ప్రవీణ విశ్వేశ్వరావు శిష్య బృందం కృతి, సంతోషి, ఎన్ఎస్ఎస్ కార్తీక, రేష్మ, నళిని, స్వప్నిక, ఆకృతి, చంద్రిక, ప్రవళ్లిక, ఉమాదేవి, సింధు, జాహ్నవి, కుందన, వరలి, నాగ అక్షయ సంయుక్తంగా గణేశ కౌతం.. నారాయణతే నమో నమో.. అలరులు కురియగా.. తదితర సంకీర్తనలకు నృత్యార్చన చేసి అలరించగా.. పద్మశ్రీ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.